కె.బాలగోపాల్

# ‘ఐటి’ భావజాలం తొలగిపోయేనా?


> **ఐటి ఒక పరిశ్రమ. కొన్ని వనరులు తీసుకుంటుంది, కొన్ని ఉత్పత్తులు ఇస్తుంది, కొంత ఉపాధి కల్పిస్తుంది. అన్ని పరిశ్రమలూ వ్యాపారమే కాబట్టి అదొక వ్యాపారం కూడ . దానిని సమాజ సేవగానో కేవలం వైజ్ఞానిక కృషిగానో భ్రమించి ఇక్కడా కుంభకోణాలా అని ఆశ్చర్యపోనక్కర లేదు. ‘సత్యం’ సంక్షోభం ఆ సంస్థ ఉద్యోగుల మానసిక ఆరోగ్యానికీ సమాజం మానసిక ఆరోగ్యానికీ కూడ మంచిదే. అందుకు రామలింగరాజుకు కృతజ్ఞులం.**

ఒక పారిశ్రామిక సంస్థ వ్యవహారాలు సంక్షోభంలో పడితే అందులో పనిచేసే ఉద్యోగులేమయిపోతారో అని మన పాలకులు ఆందోళన చెందడం మొదటిసారి చూస్తున్నాం. అందుకే చాలా ముచ్చటేస్తుంది. రామలింగరాజు తన పాపాన్ని పబ్లిగ్గా కడిగేసుకున్న క్షణం నుంచి 53 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు ఏమిటి అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, మీడియా ఏక కంఠంతో ఆదుర్దా వ్యక్తం చేస్తున్నాయి. వీరి మధ్య ఇంతటి ఏకాభిప్రాయం ఈ మధ్య కాలంలో ఎప్పుడూ చూడ లేదు.

సింగరేణి బొగ్గుగనుల కంపెనీ తనను తాను సంక్షోభం నుంచి బయటపడ వేసుకోవడానికని చెప్పి ఉద్యోగుల సంఖ్యను ఒక దశాబ్దకాలంలో దాదాపు 40 వేలు తగ్గించింది. తగ్గించకుండ సంస్థను సంక్షోభం నుంచి బయటపడేయడం సాధ్యమేనన్న సూచనలేవీ ఆ కంపెనీ యాజమాన్యం పట్టించుకోలేదు. దాని వాటాదారులయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ పట్టించుకోలేదు. వేల సంఖ్యలో కార్మికులను వినియోగించిన గుంతకల్ స్పిన్నింగ్ మిల్లు, వరంగల్‌లోని అజంజాహీ బట్టల మిల్లు, హైదరాబాద్‌లోని ఆల్విన్, భెల్, బిడిఎల్, హెచ్ఎంటి, ఐడిపిఎల్, ఇసిఐఎల్, ప్రాగాటూల్స్, హిందుస్తాన్ కేబుల్స్ ఫ్యాక్టరీలు, కర్నూలులోని రాయలసీమ పేపర్‌మిల్లు, రామగుండంలోని ఎఫ్‌సిఐ ఎరువుల కర్మాగారం, శ్రీకాకుళంలోని ఆముదాలవలస సహకార చక్కెర మిల్లు, నిజాం షుగర్స్‌వారి హిందుపురం, మిర్యాలగూడెం యూనిట్లు, మంగళగిరి, మంచిర్యాలలలోని ఏసిపి వారి సిమెంటు కంపెనీలు, గుంతకల్‌లోని రైల్వే స్లీపర్ ఫ్యాక్టరీ, ఆదోని యెమ్మిగనూర్లలోని స్పిన్నింగ్ మిల్లు, ఇంకా వెనక్కి పోతే కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ ఫ్యాక్టరీ, గాజువాకలోని మేస్ ఎలెక్ట్రానిక్ సంస్థ, రామగుండం దగ్గర అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు (ఇది పెద్ద జాబితాయే – ఎవరినయినా ఏమరుపాటున మరచివుంటే క్షమించండి) మూతబడి–లేక ఉత్పత్తిని కేవలం 10 శాతానికి కుదించి – ఆ సంస్థలలో పనిచేసిన కార్మికులందరినీ వీధిపాలు చేసినప్పుడు మాబోటి వాళ్లం కొందరం ఇవ్వాళ పెద్ద మనుషులందరూ అంటున్న మాటలే అన్నాం. ఆయా సంస్థల యాజమాన్యాల వైఫల్యమూ, దగుల్బాజీతనమే తప్ప మార్కెట్ లోటుగానీ సాంకేతిక సామర్థ్యంగానీ లేదనీ ప్రభుత్వమైనా మరొక యాజమాన్యమైనా సంస్థను చేతిలోకి తీసుకొని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తే వేలాది కార్మిక కుటుంబాలకు తిండిపెట్టిన వారవుతారనీ అన్నాం. వివరంగా పుస్తకాలు ప్రచురించాం. ఆ అభిప్రాయం ఒకటి రెండు సంస్థల విషయంలో అవాస్తవికం అయి ఉండవచ్చునేమోగానీ చాలా వరకు వాస్తవికమైనదే. కానీ ఆ రోజు విన్నవారు లేరు. ఎంతవరకు వాస్తవమో ఎంతవరకు కాదో వివేచించి జవాబు చెప్పిన వారూ లేరు. ఇది తెలుగుదేశం హయాంలోనూ జరిగింది, కాంగ్రెస్ హయాంలోనూ జరిగింది అని గుర్తుచేయడం ఉచితంగా ఉంటుంది.

వాస్తవమా అవాస్తవమా అన్నది అసందర్భమైన ప్రశ్న. యాజమాన్యం ఘనకార్యాల వల్ల మునుగుతున్న సంస్థను కాపాడాలా లేదా అన్నదానికి ప్రమాణం వాస్తవికతా పరిశీలన కాదు. ఆనాడు మూతపడ్డ సంస్థలు ‘అభివృద్ధి’ ముద్దుబిడ్డలు కావు. ఇండియాను ‘వెలిగిస్తున్న’ పారిశ్రామికరంగాలకు చెందినవి కావు. కాకపోగా ఇండియా వెలగకుండ ఉండిపోవడానికి ఆ పారిశ్రామిక ప్రయోగాలే కారణం అన్న భావజాలం బలంగా వేళ్లూని ఉండింది. వాటి మూసివేతకు నిజానికి లాభనష్టాలు, యోగ్యత అయోగ్యతల కంటే ఈ భావజాలమే ప్రధాన కారణం. ఎక్కువమంది కార్మికులను వినియోగించే శ్రమ ప్రధాన కారణం. ఎక్కువమంది కార్మికులను వినియోగించే శ్రమ ప్రధానమైన (లేబర్ ఇన్టెన్సివ్) పరిశ్రమలు, ముడిసరుకు ఉత్పత్తిదారులను భాగస్వాములను చేసే సహకారరంగ పరిశ్రమలు, లాభసాటి అయిన ఉత్పత్తి రంగంలోకి అనవసరంగా తలదూర్చిన ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక ముడిసరుకును ప్రయోగాత్మకంగా వినియోగించడం ద్వారా ప్రాంతీయ సమతుల్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేసిన సంస్థలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఉద్దేశ్యపూర్వకంగా నెలకొల్పిన సంస్థలు, ఇవన్నీ వామపక్ష పిడివాదానికి తార్కాణాలనీ వీటిలో సంక్షోభం పొడచూపిన క్షణం మూసివేయాలనీ, అప్పుడే ‘వెలుగొందే’ ఇండియా మొలకెత్తుతుందనీ భావించి వాటిని ఒక్కొక్కటిగా మూసేశారు, మూత పడనిచ్చారు.

ఈ వెలుగులో ‘నాలెడ్జ్ ఇండస్ట్రీ’ది కేంద్రస్థానం అన్నారు. నాలెడ్జ్ లేని ఇండస్ట్రీ ఎక్కడుండిందో, జ్ఞానం తనంతట తాను (ఒక వినియోగ వస్తువుకు దారితీయకుండ) పరిశ్రమ ఎట్లా అవుతుందో, వివరించే ప్రయత్నం చేయకుండ ‘నాలెడ్జ్ ఇండస్ట్రీ’ గురించి ఊదరగొట్టారు. దాని నిర్వాహకులయిన రామలింగరాజులూ నారాయణమూర్తులూ నవీనయుగ వైతాళికులన్నారు. వాళ్లసలు మానవ మాత్రులే కారన్నారు. వాళ్ల ఉత్పత్తి చేసేది శుద్ధ జ్ఞానమనే అనుకున్నా, వారు దానితో వ్యాపారం చేస్తున్నారు కదా, వ్యాపారం అన్నాక తప్పుడు లెక్కలూ దాచిపెట్టే ఖాతాలు ఉండకపోవు కదా అన్న సందేహం వచ్చినవారు తమంతటతామే సిగ్గుతో కుంచించుకు పోయేంతగా వారిని ఆకాశానికెత్తేశారు. ఈ ‘జ్ఞాన పరిశ్రమ’లో శ్రమించేవారు ఇనప పనిముట్లతో పనిచేసే మొరటు మనుషులు కాకపోవడం, మల్లెపువ్వుల వంటి పిల్లలు కావటం ఈ ఇమేజ్‌ను పెంచింది.



ఈ మల్లెపూవులు వాడిపోతాయేమోనని ఇప్పుడందరికీ ఒకటే ఆదుర్దా. అవేం వాడిపోవు. నెలకు 50 వేల జీతం నుంచి 10 వేలకు దిగివచ్చి నాలుగురోజులు భువి మీద సంచరించడం మాత్రమే జరుగుతుంది. ఏదో ఒక ఉపాధి వారికి ఎప్పటికీ దొరకకుండపోదు. ఎవ్వరూ ఇవ్వకపోతే స్వంత సంస్థలు పెట్టుకునే అవకాశమూ లేకపోలేదు. ఈ తాత్కాలిక సంక్షోభం వారి మానసిక ఆరోగ్యానికీ సమాజం మానసిక ఆరోగ్యానికీ కూడ మంచిదే. అందుకు రామలింగరాజుకు కృతజ్ఞులం.

కానీ నిజానికి వారి పేరు మీద ఆందోళనంతా వారి గురించేనా అన్న సందేహమూ వస్తున్నది. ‘సత్యం’ సిబ్బంది వేరే ఏ సాఫ్ట్‌వేర్ సంస్థలోనయినా ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తే వారికెవ్వరూ ఉద్యోగాలు ఇయ్యవద్దని– అంటే వారు ఆ సంస్థను అంటిపెట్టుకొని ఉండి దాని పునరుద్ధరణకు దారి సుగమం చేయాలని– సాఫ్ట్‌వేర్ సంస్థల జాతీయ కూటమి (నాస్కాం) ఇతర ఐటి రంగ సంస్థలకు సందేశం పంపినట్టు వచ్చిన వార్తలను వారు నిర్ద్వంద్వంగా ఖండించలేదు. పైగా, ఇతర ఐటి సంస్థలు ఆ నిర్ణయం తీసుకుంటే మంచిదేకదా అని నాస్కాం పెద్దలు కొంటెగా సమర్థించుకోవడమూ జరిగింది.

ఐటి రంగంలో ఒక ఉన్నతస్థాయి ఆర్థిక వ్యవస్థగా భారత్ పొందిన గుర్తింపునూ తద్వారా ఆ మార్కెట్‌లో లభించిన చోటునూ పోగొట్టుకోకూడదని మనవారి పట్టుదల. అది సత్యం సంస్థనూ అందులోని సిబ్బంది ఉపాధినీ కాపాడడానికి కావలసిన ప్రోద్బలం ఇస్తున్నది. కాపాడవద్దని ఎవరూ అనరుగానీ దానికోసం ఏయే విషయాలలో రాజీపడబోతారో ఎవరి చేతిలో ఏం పెట్టబోతారో చూడవలసివుంది. ‘ఎట్లాగైనా కాపాడాలి’ అన్న ఆరాటం అక్రమాలకు కవచం కాగలదు. కాగా ఇప్పటికైనా ఐటి రంగాన్ని ఆవరించిన కృత్రిమ భావజాలం శాశ్వతంగా తొలగిపోతుందని ఆశిద్దాం. అదొక పరిశ్రమ. కొన్ని వనరులు తీసుకుంటుంది, కొన్ని ఉత్పత్తులు ఇస్తుంది, కొంత ఉపాధి కల్పిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్ని పరిశ్రమలూ వ్యాపారమే కాబట్టి అదొక వ్యాపారం కూడ. దానిని సమాజ సేవగానో కేవలం వైజ్ఞానిక కృషిగానో భ్రమించి ఇక్కడ కూడ కుంభకోణాలా అని ఆశ్చర్యపోనక్కర లేదు. ఎక్కడ వ్యాపారముంటే అక్కడ కుంభకోణాలుంటాయి. అంతకంటే ముఖ్యంగా ఈ ఐటి పరిశ్రమ ఏ ఉత్పత్తులు ఇస్తుంది, ఎవరికి ఉత్పత్తులు ఇస్తుంది, ఎంత ఉపాధి కల్పిస్తుంది, సమాజం నుంచి ఎన్ని వనరులు కోరుకుంటుంది అని చూడడం అవసరం. ఖరీదయిన ఐటి రంగం కల్పించిన ఖరీదయిన జీవన విధానం ఆర్థిక వ్యవస్థనే కాదు, మధ్యతరగతి ఎకానమీని కూడ ఎంతగా వక్రీకరించిందో చూడడం అవసరం. ఐటిరంగానికి ధారాదత్తం చేసిన భూములు ఎవరికి భూములు లేకుండ చేశాయో, వారికి ఇచ్చిన ప్రాముఖ్యం ఏ ప్రాధాన్యతలను కత్తిరించి వేసిందో ఆలోచించడం అవసరం. ఉపాధి కోసం ఎదురుచూస్తున్న కోట్లాది యువకులకు ఏ రకంగా సంబంధంలేని ఈ రంగాన్ని ఆకాశం నుంచి నేలమీదకు దించి దాని పరిమితికి తగిన స్థానంలో దానిని ఉంచడం అవసరం.